క్లుప్తంగా

పేదలకు అన్నదానం



నెల్లూరు(క్రైమ్) : ఎంఎస్సార్ సేవాసమితి సభ్యులు నగరంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎస్సార్ వ్యవస్థాపకుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి వివాహ దినోత్సవం సందర్భంగా సమితి సభ్యులు తొలుత వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులో సాయిబాబా ఆలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. సేవా సమితి అధ్యక్షుడు సాయిబాబు, సభ్యులు నిషాద్, రూపక్, రహీం , మణి, అభి పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



నెల్లూరు(అర్బన్) : కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు రాణాప్రమోద్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కృష్ణచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వ పెద్దాస్పత్రిలో రోగులకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్, డీన్లు పాల్గొన్నారు.

అన్నదానం

స్థానిక మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ ఎంఎస్సార్ స్పాస్టిక్ సెంటర్లో మానసిక దివ్యాంగులకు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి యూత్ నాయకుడు శ్రీను ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజ్ కుమార్, తౌఫిక్ పాల్గొన్నారు.

అమర జవానులకు నివాళి



నెల్లూరు(బృందావనం) : పుల్వామా దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవానులను స్మరిస్తూ చేయూత చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఇసుకపల్లి యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత మినీబైపాస్ రోడ్డులోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి పుల్వామా దాడిలో అమరులైన వీరజవానులకు నివాళులర్పించారు. అనంతరం ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద అన్నదానం చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు నందకిశోర్, కామేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాద రహిత డ్రైవర్‌కు సన్మానం



నెల్లూరు సిటీ : రాష్ట్రస్థాయిలో ప్రమాదరహిత డ్రైవర్‌గా గుర్తింపు పొందిన కృష్ణయ్యకు ప్రజా రవాణా అధికారి మురళీమోహన్ సన్మానం చేశారు. భద్రతా మాసోత్సవాల ముగింపు సభను నెల్లూరు డిపో–2లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రమాదరహిత సర్వీసును అందిస్తున్న డ్రైవర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్థాయిలో రఫీ, ప్రసాద్‌రావు, కయూమ్‌లను ఎంపిక చేశారు.

జాతీయ హాకీ పోటీలకు భానుప్రకాష్



భానుప్రకాష్‌ను అభినందిస్తున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కొత్తకోట భాను ప్రకాష్ ఎంపికయ్యారు. ఈ క్రమంలో అదనపు కమిషనర్ నందన్ శుక్రవారం తన చాంబర్‌లో భానుప్రకాష్‌ను అభినందించారు. జాతీయ పోటీల్లో రాణించి నెల్లూరు కార్పొరేషన్ గౌరవాన్ని పెంచాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

➡ డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని కొండదిబ్బ, అలంకార్ సెంటర్, బ్రాహ్మణవీధి, శివాలయం, ఫత్తేఖాన్‌పేట, రైతు బజారు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు.. ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలో రాజావారివీధి, శివాలయం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

➡ డీఆర్‌డీఏ సబ్‌స్టేషన్ పరిధిలో సుబేదారుపేట, ట్రంకురోడ్డు, కనకమహల్ సెంటర్, కాకర్లవారి వీధి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు.. కోటమిట్ట సబ్‌స్టేషన్ పరిధిలో జెండా వీధి, కోటమిట్ట, గిడ్డంగివీధి, వీబీఎస్ కల్యాణ మండపం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

గుంతలమయంగా ములుమూడి కలుజు





సమస్యలతో సహవాసం

ములుమూడిలో ప్రగతి శూన్యం

- గ్రామంలో పడకేసిన పారిశుద్ధ్యం
- కొనసాగుతున్న దోమల ఉధృతి
- కలుజుపై భారీ గుంతలతో ప్రమాదాలు

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. మౌలిక వసతులను మెరుగుపరచడంలో ఎలాంటి శ్రద్ధ వహించకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం, రోడ్లు అధ్వానంగా మారింది. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ఎలాంటి ఫలితం ఉండడం లేదు. దీనికి ఉదాహరణే ములుమూడి గ్రామం.



ములుమూడి ప్రధాన రహదారి వెంబడి వేసిన చెత్త

నెల్లూరు సిటీ : నెల్లూరు రూరల్ మండలంలోని ములుమూడి గ్రామం సమస్యల వలయంలో కూరుకుపోయింది. పచ్చటి వాతావరణంలో ఉండే గ్రామం పారిశుద్ధ్యానికి నోచుకోవడం లేదు. నెలకు ఒకసారి మాత్రమే పారిశుద్ధ్య వాహనాలు రావడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. సైడు కాలువల్లో చెత్తను తొలగించకపోవడంతో మురుగునీరు నిల్వ ఉంటున్నాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రమాదపు అంచున కలుజు

ములుమూడి కలుజు ప్రమాదపు అంచున ఉంది. చెరువులోని నీరు పారే మార్గంలో శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కలుజు దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కలుజు వద్ద పెద్ద గుంత ఉండడంతో అటువైపుగా వెళ్లే వాహనాలు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం గుంతను పూడ్చే ప్రయత్నం కూడా ప్రజాప్రతినిధులు చేయకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దోమలతో సహజీవనం

గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో సాయంత్రం 6 గంటలు దాటితే దోమలు దండయాత్ర చేస్తున్నాయి. గ్రామంలో ఫాగింగ్ అప్పుడప్పుడు తూతూ మంత్రంగా చేస్తున్నారు. దీంతో మురుగునీరు నిల్వ చేరి దోమల ఉధృతి తీవ్రంగా ఉంటోంది. ఫలితంగా పలువురు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

పాఠశాలకు ప్రహరీ ఏదీ?

గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు కనీసం ప్రహరీని కూడా ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలో ఉంటున్నారు. ఆటల్లో రోడ్డు మీదకు చిన్నారులు వస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, వెంటనే అధికారులు స్పందించి ప్రహరీ గోడ నిర్మాణానికి పూనుకోవాలని కోరుతున్నారు.

గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోండి



ములుమూడి కలుజు మార్గంలో ఇతర గ్రామాలకు రాకపోకలు సాగుతుంటాయి. అయితే ఇక్కడి కలుజు వద్ద చాలా కాలంగా పెద్ద గుంతలు ఏర్పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసులు, గ్రామస్తుడు



ములుమూడి గ్రామ సచివాలయం



ప్రహరీ లేని జెడ్పీ పాఠశాల

ఆలయ శిఖర పునఃప్రతిష్ట నేడు

నెల్లూరు(బృందావనం) : మూలాపేట శంకర మఠంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ శిఖర పునఃప్రతిష్ట శనివారం ఉదయం 8 గంటలకు జరుగనుందని నిర్వాహకులు నందకిశోర్, ఉషాకుమారి తెలిపారు. భక్తులు రావాలని కోరారు.

ఆదాల రాక నేడు

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి శనివారం నెల్లూరుకు రానున్నట్లు పార్టీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రామ్మూర్తినగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వివరించింది.

పద్మశాలి సంఘీయుల జిల్లా సమావేశం రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : పొదలకూరులోని అంబేడ్కర్ భవనంలో పద్మశాలి సంఘీయుల జిల్లా సమావేశం ఆదివారం జరుగనుందని సంఘ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, కార్య నిర్వాహక అధ్యక్షుడు గోపాల్, గౌరవాధ్యక్షుడు నందం అశ్వత్థామ తెలిపారు. శోధన్‌నగర్‌లో శుక్రవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పద్మశాలి సంఘీయుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు బూదాటి రాధయ్య, డాక్టర్ సుధాకర్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



నెల్లూరు (టౌన్) : స్థానిక ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలోని ఎంపీపీ పాఠశాలలో జిల్లా సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు శుక్రవారం నోటు పుస్తకాలు, పెన్సిల్స్, రబ్బర్లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యం, కేశవులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ : రూరల్‌లోని కొండ్లపూడి గ్రామంలో రూ.35 లక్షలతో సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. టీడీపీ నేతలు విజయ్‌కుమార్, మహేష్, మధు, రవి, చిన్నబ్బయ్య పాల్గొన్నారు.

➡ రూరల్‌లోని 29వ డివిజన్ గాంధీనగర్‌లో పార్కును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజానాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి కనపర్తి గంగాధర్ పాల్గొన్నారు.

వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న సీపీఎం జిల్లా కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ, సామాన్యులకు ఎలాంటి ఉపయోగం లేని బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని, దీనిని అన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికే బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, రూ.500 వేతనం పెంచాలని పోరాటాలు చేసినా దీనిపై బడ్జెట్‌లో ప్రకటన లేదని వాపోయారు. సమావేశంలో సీపీఐ జిల్లా నేత దామా అంకయ్య, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత రాంబాబు, ఫార్వర్డ్‌బ్లాక్ నేత నరసింహారావు, ఏపీ రైతు సంఘం నేత శ్రీరాములు, సీపీఎం నాయకురాలు రెహనాబేగం పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్‌ను నిరసిస్తూ ఆందోళన



ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

నెల్లూరు(అర్బన్) : ప్రైవేటు ఇంటర్ కళాశాలల్లో జరుగుతున్న ప్రాక్టికల్స్ మాస్‌కాపీయింగ్‌ను నిరసిస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ ఈ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు ప్రైవేటు విద్యాసంస్థలు పెద్ద ఎత్తున అదనపు వసూళ్లకు పాల్పడ్డాయన్నారు. డబ్బులు ఇవ్వని విద్యార్థులను ఫెయిల్ చేస్తామంటూ భయపెట్టారన్నారు. దీనిని అరికట్టడంలో ఆర్‌ఐఓ విఫలమయ్యారని విమర్శించారు. అనంతరం డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కిశోర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు హనీష్, శివం వర్మ, నాయకులు వైభవ్, సుధీర్, శరణ్, సుమంత్, సిద్దూ పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

నెల్లూరు సిటీ : ధనలక్ష్మీపురంలోని ఓ పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర, జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పాఠశాల వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారులు విచారణ చేయాలని, బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలన్నారు.

విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిద్దాం



పీడీఎస్‌యూ విలీన సభలో నాయకులు

నెల్లూరు (టౌన్) : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిద్దామని ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా తెలిపారు. స్థానిక అనిత థియేటర్ సమావేశ మందిరంలో పీడీఎస్‌యూ విలీన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రగతిశీల విప్లవ విద్యార్థి సంఘాలు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. పీడీఎస్‌యూ మాజీ అధ్యక్షులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కొన్ని తీర్మానాలను ప్రవేశపెట్టారు. అమ్మఒడి పథకాన్ని అమలు చేయాలని, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో కాంట్రాక్టు ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు సాగర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించొద్దు

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించొద్దని, ఆయా యజమానులకు నోటీసులు జారీ చేయాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. ఎన్‌ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులు, పట్టణ విభాగాధికారులతో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డు ప్లానింగ్ కార్యదర్శి తమ లాగిన్లను తనిఖీ చేసుకోవాలని, ఎలాంటి ఫైళ్లు పెండింగ్‌లో ఉంచుకోకుండా పరిష్కారానికి పంపించాలన్నారు. సమావేశంలో సీపీ హిమబిందు, డీసీపీ పద్మజ, ఏసీపీలు వేణు, ప్రకాష్, సర్వేయర్ సోమేశ్వరరావు, సూపరింటెండెంట్ పద్మ పాల్గొన్నారు.

➡ మెప్మా డైరెక్టర్ ఎం.తేజ్‌భరత్ ఆధ్వర్యంలో పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలకు 'మెప్మా' కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు వీడియో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. అదనపు కమిషనర్ నందన్ పలు సూచనలు చేశారు.

నిత్యావసర సామగ్రి అందజేత



నెల్లూరు(బృందావనం) : పొదలకూరురోడ్డులోని వియాని హోమ్‌లో బాలలకు బాప్టిస్టు చర్చి డొనీహాల్ 'షో యువర్ లవ్' టీమ్ ఆధ్వర్యంలో నిత్యావసర సామగ్రిని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బృంద సభ్యులు కృపారాజన్, రెవరెండ్ మణిరావ్, మేరీ సరళ, జ్యోతి జయకుమార్, ప్రభావతి పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(క్రైమ్) : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడని ఎస్పీ జి.కృష్ణకాంత్ కొనియాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అతిపిన్న వయస్సులోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య బాధ్యతలు చేపట్టారన్నారు. తన పదవీ కాలంలో అనేక విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వంలోనూ పలు కీలక పదవులు నిర్వహించారన్నారు. నిరాడంబర జీవనం సాగించారని, ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

జెడ్పీలో..

నెల్లూరు (పొగతోట) : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను స్థానిక జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పూలమాల వేశారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏలో..

స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పూలమాల వేశారు. ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

డీసీఓ కార్యాలయంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీసీఓ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డీసీఓ గుర్రప్ప పూలమాల వేసి నివాళులర్పించారు. సంజీవయ్య సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీలత, ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో..

నెల్లూరు(అర్బన్) : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డీఎంహెచ్‌ఓ సుజాత పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పేదల కోసం చేసిన సేవలను కొనియాడారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో..

నెల్లూరు (టౌన్) : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈఓ ఆర్.బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, సెక్టోరల్ అధికారులు, ఏడీలు పాల్గొన్నారు.



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో..



డీసీఓ కార్యాలయంలో..

డీఆర్వోను కలిసిన జీపీ



నెల్లూరు(అర్బన్) : నగరానికి చెందిన చుండూరు శ్రీహరి నారాయణరావు ప్రభుత్వ ప్లీడర్(జీపీ)గా నియమితులయ్యారు. దీంతో ఆయన కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావును ఉత్తర్వులు అందుకున్నారు.

రుసుము అవసరం లేదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సభ్యత్వానికి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛందంగా చేరాలని కోరారు.

ఎమ్మెల్సీ కల్పలతారెడ్డికి పర్వతరెడ్డి పరామర్శ



నెల్లూరు(బారకాసు) : అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గంలోని తలుపుల గ్రామంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్పలతారెడ్డి మేనకోడలు భూమిక తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. అయితే తల్లిదండ్రులు పెద్దమనస్సు చేసుకుని భూమిక అవయవదానానికి ముందుకొచ్చారు. ఈ క్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి మనోధైర్యాన్ని కొనియాడారు. అనంతరం భూమిక చిత్రపటానికి నివాళులర్పించారు.

తల్లిదండ్రుల ఆందోళన

నెల్లూరు సిటీ : ఆమంచర్ల గ్రామంలో 30 ఏళ్లుగా ఉన్న ప్రాథమిక పాఠశాల నుంచి తరగతుల విలీన ప్రక్రియను నిలిపివేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడి 3, 4, 5 తరగతులను కిలోమీటర్ దూరంలోని ఆమంచర్ల గిరిజన కాలనీ పాఠశాలలో కలపడాన్ని అంగీకరించమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణయ్య, బుజ్జమ్మ, మస్తానమ్మ, లక్ష్మయ్య, దీప, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

